# వేడివెన్నెల

ప్రేమించానని వచ్చిన అమ్మాయిని తిరస్కరించినందుకు అతనికిదొరికిన ప్రతిఫలం?

పి.సుజాత కథ


''పోస్ట్''

కేకవిని బయటకు వచ్చేసరికే బరువైన కవర్ ఒకటి గుమ్మం దగ్గరకు విసేరేసి వెళ్లిపోయాడు పోస్ట్‌మాన్. వంగి దాన్ని అందుకొని ఫ్రమ్ అడ్రస్ కోసం చూస్తూ లోపలికి నడిచాడతను. కన్పించలేదు. 'అంత పెద్ద లెటర్ వ్రాసేవాళ్లు ఎవరా అని ఆలోచిస్తూ ఆ కవర్‌ని ఓపెన్ చేశాడు.

''ఇదే నా మొదటి ప్రేమలేఖ,
రాసాను నీకు చెప్పలేక
ఎదుటపడి మనస్సు తెలుపలేక,
తెలుపుటకు భాష చేతకాక''

అని మొదలుపెడదామంటే ఇదేమి ప్రేమలేఖ కాదే. విడిపోయాక రాసిన లేఖ. అయినా ఇదే నా మొదటి లేఖ కదూ! ఏమిటి సుత్తి అనుకుంటున్నావా! ఫర్వాలేదులే నీ కోసం ఐదు సంవత్సరాలు నిర్విరామంగా నిరీక్షించిన నా కోసం కేవలం రెండు పేజీలు ఓపికపట్టి చదవలేవూ... చదువుతావనే నమ్మకంతోనే వ్రాస్తున్నాను.

మొదలుపెట్టానే కానీ ఏమని వ్రాయలో నాకే తెలీడం లేదు. ఇదివరకైతే ఇలా వ్రాసిన అన్ని లెటర్స్‌ని జాగ్రత్తగా భద్రపరిచేదాన్ని. అన్నీ కలిపి ఒక్కసారే నీకు అందజేద్దామని. మనస్సు నిండా నిన్నే నింపుకుని వ్రాసిన లేఖలన్నీ మనస్సు చంపుకొని అగ్నిదేముడికి అర్పించేశాను. అవన్నీ బూడిదయ్యేవరకూ నా మనస్సుని చంపుకోగలిగానేమో కాని తర్వాత మళ్లీ మామూలే. కళ్లు తెరుచుకుంటే నీవే కనిపిస్తున్నావని కళ్లు మూసుకుంటే అప్పుడు కూడా నీవే నా కళ్లల్లో. పోనీ కళ్ళు పీకేసుకుందామంటే మనస్సునేమి చేయను?



నా మనస్సులో నీ ప్రతిబింబాన్ని ఎలా చెరిపేయను. నీపై పెంచుకున్న ఆశల మేడలను కూల్చేయాలన్నా, నిన్ను నా నుండి దూరం చేసుకోవాలన్నా ఎంత కష్టమంటే, అంతకంటే నా ప్రాణం తీసుకోవడం చాలా సులభం. ఎంతో అందమైన భాషతో, అంతకంటే అందమైన భావనతో నా ప్రేమను నీకు తెలియజేయా

అని ఎంత ఆరాటపడ్డానో తెలుసా!, అవన్నీ తెల్లకాగితాలకే పరిమితమయ్యాయి. కాని నీవరకూ రాలేకపోయాయి. ఏం చేస్తాం? అదంతా నా దురదృష్టం. 'రెప్ప వేయకుండా ఎక్కువసేపు ఎవరు ఉంటారో పందెం' 'అని నీవంక సూటిగా చూస్తుంటే తీక్షణకు తట్టుకోలేని నా కళ్లు కార్చే నీటిని చూస్తూ అన్నావు ' అంత పట్టుదలైతే ఎలా?' అని గుర్తుందా? నాకు మాత్రం ప్రతి అక్షరం గుర్తే, ప్రతి మాటా జ్ఞాపకమే. అందమైన సాయంత్రం చూసినా, పున్నమి వెన్నెల చూసినా, చెట్లపక్కన పొందికగా ఉన్న పాదలను చూసినా నీవే గుర్తుకొచ్చేవాడివి. ఆ అందమైన అనుభూతులన్నీ ఏ లమని తీరావో కూర్చుని, నీవూ, నేనూ తప్ప ఎవరూ లేని ఒంటరి పున్నమి రాత్రుల్లో నీతో చెప్పాలని ఎన్ని కలలు కన్నాను. ఎంత ఆరాటపడ్డాను? ఇప్పుడు నేను ఎవరితో పంచుకోనూ... ఆ అనుభూతులన్నీ.

నా పరీక్ష పోయిందంటే కారణం నువ్వేనని నాకు మాత్రమే తెలిసిన నిజం. పుస్తకం చుట్టూ చేతులు, నీ చుట్టూ ఆలోచనలు. ఇలా అయితే పరీక్షపోక ఫస్ట్‌క్లాస్ వస్తుందా? అయినా పరీక్ష పోయిందని నేనేమి బాధపడలేదు. వెధవ పరీక్ష పోతేపోయింది. నీతో గడిపే మధుర గడియలు ముందుండగా పరీక్ష పోయిందనే బాధ ఎందుకు అనుకున్నాను. కాని ఇప్పుడేమయింది. నేను ఎవరి కోసం అయితే చదువును నిర్లక్ష్యం చేసానో ఆ నువ్వు నన్ను కాదన్నాక మళ్లీ ఆ విద్యనే ఆశ్రయించాల్సి వచ్చింది.

నీకు గుర్తుందా! వాడెవడో నా వెనకబడి వేధిస్తుంటే ఎంత తిట్టేదాన్నో. ఛీ! ఛ! అన్నా సరే ఫాలో అవుతుంటే నాకు ఒక ఫూల్‌లా అనిపించేవాడు. ఇప్పుడు నీ కళ్లకు నేనూ అంతే కదూ! నేను ఎక్కువగా ఇష్టపడే వాళ్లు నన్ను నిర్లక్ష్యం చేస్తే నేను భరించలేను. నిజం. అది నా బలహీనత. కాని నాకే ఆశ్చర్యంగా ఉంది ఎలా బతకగలుగుతున్నానా అని. బహుశా నా తల్లిదండ్రుల కోసం అయివుండొచ్చు. వాళ్ల కోసం నేను బతికి తీరాలి. ఎందుకో తెలుసా? నేను నీపై పెట్టుకున్న ఆశలకంటే రెట్టింపు ఆశలు పెంచుకున్నారు వాళ్లు. ఇప్పుడు నేను అర్ధాంతరంగా ఏ ఆత్మహత్యో చేసుకుంటే— 'ఏ కారణం లేకుండా కన్నెపిల్ల చచ్చిపోదు' అని లోకులు అంటుంటే ఆ మాటలు నా చావుకంటే ఎక్కువగా బాధిస్తాయి నా తల్లిదండ్రులను. అకారణంగా నాపై మచ్చ వస్తుంది. నామీద పడే మచ్చ గురించి నేనేమీ భయపడటం లేదు. నా వెనక అమాయకంగా పెరిగే నా తోబుట్టువులను చూసి వెనకాడుతున్నాను. అభం, శుభం తెలియని వాళ్లను నా కారణంగా అభాసుపాలు చేయడం నాకు ఇష్టం లేదు. మళ్ళీ జన్మంటూ వుంటే కేవలం నీ కోసం, నీ ప్రేమను పొందడం కోసం, కేవలం నీ కోసం నీ కోసమే నేను పుడతాను. పుట్టేముందు ఆ దేముడ్ని ఏమని ప్రార్థిస్తానో తెలుసా! కేవలం నాకోసం నేను ఆలోచించుకునే మనస్తత్వం నాకివ్వమని, ఎదుటివాళ్లు ఏమైనా ఫరవాలేదనే స్వార్థం కలిగేలా, కనీసం ఈ జన్మలోనైనా నేను కోరుకున్న వ్యక్తిని, నన్ను ప్రాణప్రదంగా ప్రేమించే వ్యక్తిని. ఆ వ్యక్తిని నిన్నే చేసి

నాకు ప్రసాదించమంటాను. నేను, నా భర్త, నా పిల్లలు తప్ప వేరే ఆలోచన లేకుండా చేయి స్వామి అని వేడుకుంటాను. ఇప్పుడు నువ్వు నన్ను కాదన్నావని నీపై కోపమూ లేదు, పెద్దలపై కక్షా లేదు.

"పొరబడితివా తడబడితివా
పోతే పోనీ అనుకొంటివో
చేసావు మా పెళ్లి స్వర్గాన
మరిచావు అది వ్రాయ మానుదుటన
ఓ బ్రహ్మయ్యో! తప్పు నీదయ్యా"

అంతేకాదు. నువ్వూ నేను బాధపడి ఏం ప్రయోజనం? ప్రయోజనం లేదని తెలిసి నా బాధపడకుండా ఉండలేకపోతున్నాను. నా కన్నీళ్లు నా మాట వినడం ఎప్పుడో మానేశాయి. నేను పిలిచే ప్రతి పిలుపూ నీ కోసం, నేను చూసే ప్రతి చూపు నీ కోసం, నేను వేసే ప్రతి అడుగు నిన్నే చేరాలనే, నేను వ్రాసే ప్రతి ప్రదం నిన్ను స్మరించుకునే, నేను గీసే ప్రతి గీతా నిన్ను ఊహించుకునే. కాని ఇప్పుడు ఏ ఒక్కటీ, నాకు సహకరించడం లేదు.

పూర్తిగా పిలుద్దామంటే గొంతు పూడుకుని పోయింది. స్పష్టంగా చూద్దామంటే కన్నీళ్ళు అడ్డు, నువ్వు గుర్తురాగానే పుట్టే భావపరంపరలో ఒక్కటైనా రాద్దామంటే మనస్సు మూగపోయింది. పోనీ పిచ్చిగీతలైనా గీద్దామంటే నా చేయి సాగడం లేదు. నేను ఏమి చేయను?

నా జీవితంలోకి ముందు ముందు ఎవరు ప్రవేశించినా సరే నా బాధను మాత్రం తెలియనివ్వను. ఆ వ్యక్తికి అనుగుణంగా మసలుకొంటాను. నా పెదాలనిండా నవ్వు, నా కళ్లనిండా కాంతి ఇకముందు ఎప్పుడూ వుంటుంది. కానీ నేస్తం... ఆ కాంతి వెనుక క్రీనీడలో కదలిక మాత్రం నువ్వే. అదే గుచ్చిగుచ్చి చూడగా నీకు మాత్రమే కనిపిస్తుంది. నీ జ్ఞాపకాల గ్రంథాన్ని నా గుండె గదిలో భద్రంగా దాచి ఆ దరిదాపులకు ఎవర్నీ రానివ్వను ప్రభూ... ఎప్పుడో ఏ అమావాస నిశిలోనో నాకు మాత్రమే

# సమిష్టి వివాహాలు



*ఒకే పందిట్లో కాకపోయినా... ఒకే స్టేడియంలో ఇరవై వేల పెళ్ళిళ్ళు ఒకేసారి జరిగాయంటే... మీరు నమ్మగలరా? నమ్మినా... నమ్మకపోయినా ఇది నిజంగా నిజం! దక్షిణ కొరియాలోని సియోల్ ఒలింపిక్ స్టేడియంలో కిందటి ఆగస్టు నెలలో జరిగిన ఈ సమిష్టి వివాహాలు ప్రపంచంలో ఇంత పెద్ద సంఖ్యలో జరగడం మొదటిసారి! యూనిఫికేషన్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన ఈ పెళ్ళిళ్ళు అందరికీ ఆదర్శం కావాలి! అనవసరమైన ఆడంబరాలకు పోక అందరూ ఇలా చేస్తే ఎంత హాయిగా వుంటుందో కదా!*

*—జూపిటర్*

పరిమితమైన ఒంటరితనంలో తలుపు తెరిచి సుతారంగా స్పర్శించుకుంటాను. దైనందిక జీవితంలో విసిగిపోయి కొంతలో కొంత ఉపశమనంగా మిమ్మల్నందరినీ చూడాలని పరుగెత్తుకుని వస్తుంటే ఆ ఎదురుగా వచ్చేది నీవని తెలిసి తలెత్తుతాను. అప్పుడు కనీసం చిరునవ్వు అయినా నవ్వడం మరిచిపోకు నేస్తం. ఆ ఒక్క చిర్నవ్వు చాలు నిస్తేజంగా ఉన్న బతుకును ఉత్తేజపరచడానికి, మళ్లీ జన్మ వరకూ నీ కోసం ఎదురు చూడటానికి.

నేను ఎక్కడ మొదలుపెట్టి ఏ విషయంలోకి వస్తున్నానో నాకే తెలియడం లేదు. అన్ని విషయాలు ఒకేసారి చెప్పాలనే తాపత్రయం. ఎలా వ్రాసిన చదివి అర్థం చేసుకునే శక్తి నీకుందిగా. నేను మాత్రం నీకు చెప్పాలనుకున్నదాంట్లో ఒక్క వంతు కూడా చెప్పలేకపోతున్నాను. ఆరోజేమన్నావు. పెద్దవాళ్లను అడిగితే ఛీ అంటారన్నావు కదూ! అసలు నేను వాళ్లను అడగమన్నానా! నేనంటే ఇష్టమో కాదో తెలుసుకుందామనుకున్నాను. కాని నువ్వన్న మాటతోనే నా గొంతు పూడుకుని పోయింది. నేనింకేం చెప్పను. కాస్త నేను స్థిరపడే వరకూ ఆగు అంటే నేనెంత సంతోషించేదాన్ని. నీ కోసం ఎన్ని యుగాలైనా వేచి వుండేదాన్ని. ఈ లెటర్ అర్థాంతరంగా ఎందుకు ముగిస్తున్నానో తెలుసా నీలో నా మనసు కూడా ఇలాగే అయింది కనుక. నేనే నీకు అక్కర్లేనప్పుడు జ్ఞాపకార్థం నా ఈ కాగితాలు మాత్రం ఎందుకు? చదివిన వెంటనే చింపేస్తావు కదూ!

క్రింద ఎలాంటి సంతకమూ లేదు. లేకపోయినా ఆ వ్రాసిందెవరో తెలుసు అతనికి. చదివిన తరువాత చాలాసేపు మనస్సు భారమై కదలలేకపోయాడు. మెదడు పనిచేయడం మానేసి చాలాసేపు అయింది.

ఏదో ఆకతాయితనంగా పెళ్ళి చేసుకోమని అడిగిందనుకున్నాడే కాని తనపట్ల ఇంత ప్రేమ నింపుకుందని ఊహించలేకపోయాడు. అందుకే ఆరోజు ఏదో నచ్చచెప్పి పంపేశాడు. ఆమె వెడుతూ వెడుతూ చూసిన ఆఖరి చూపు తనకింకా గుర్తే. అయితే ఆ చూపుకి అర్థం ఇప్పుడు తెలిసింది.

అవును, ఆమెను చూడాలి. తనివితీరా చూడాలి. ఒక్కసారి చేతికందితే అరచేతిలో ఎత్తుకెళ్ళి గుండెలో దాచుకోవాలి. అవును అంతే ఆ ఆలోచన వచ్చిందో తడవుగా ఒక్కసారే లేచాడు.

చేతిలో కాగితాలతోనే వీధిలో నడుస్తూ సందు మలుపులో హఠాత్తుగా ఆగిపోయాడు. ఎదురుగా ఉన్న దృశ్యం చూసి.

ఎవరికోసమైతే వచ్చాడో ఆమె పెళ్లి బట్టల్లో హుందాగా, ఒకరికి తోడుగా కారెక్కుతోంది. కోరివస్తే కాలితో తన్ని తరువాత జ్ఞానోదయమై ఎక్కడ పడింద అని చూసుకునే లోపు ఆ పూవు చేరుకోవలసిన కోవెల చేరిపోయింది.

గాలివాటుకి అతని చేతిలో కాగితాలు ఎగిరి ఆమె కారు క్రిందపడి నలిగిపోయాయి ఆమె మనస్సులాగే.

కారు అతన్ని దాటిపోతుంటే ఆమె చూసిన చూపు ముల్లుగుచ్చుకున్నట్లయింది.

అదే చూపు ఆ రోజు తను నచ్చచెప్పి

పంపిస్తుంటే చూసిన చూపు.

తరంగాల లాంటి ఆలోచనలు అతనికి నదిలేపి నిండు గోదారిలా ఆమె సాగిపోయింది.

విచిత్రంగా అతను ఏడుస్తున్నాడు.

తమున్నది రోడ్డు అని, తనని అందరూ చూస్తున్నారని కానీ గమనించకుండా రెండు చేతుల్లోనూ మొహాన్ని దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

చిన్న పిల్లాడల్లే క్రింద కూర్చుండిపోయి.

